సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 29 । ఆగస్టు । 2024



తంబళ్లపల్లె టీడీపీలో రచ్చ రచ్చ

అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ రచ్చకెక్కింది. వర్గాలుగా విడిపోయిన నేతలు ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలతో విరుచుకుపడుతున్నారు. -8లో



రాష్ట్రంలో అరాచక పాలన

సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.150

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 476 మెట్రిక్ టన్నులు





కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో వైద్యులు, వైద్య సిబ్బంది భద్రత ..సౌకర్యాలపై 'సాక్షి' క్యాంపెయిన్.

భద్రత పెంచాలి



కోల్‌కతాలో జరిగిన అమానుష సంఘటన పునరావృతం కాకుండా చూడాలి. మహిళలపై లైంగికదాడులకు పాల్పడాలంటే వణకు పుట్టేలా నిందితులకు శిక్ష విధించాలి. ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. ఈ క్రమంలోనే ఆసుపత్రుల వద్ద భద్రతను పెంచాలి. –డా.స్వర్ణలత, ప్రిన్సిపాల్, అన్నమాచార్య కాలేజి ఆఫ్ ఫార్మసీ, రాజంపేట

పూర్తి స్థాయిలో రక్షణ కల్పించాలి



వైద్యులకు నిర్ణీత పనివేళలు ఉండవు. ఏసమయంలో నైనా వైద్య సేవలు అందించాలి. కోల్‌కతా ఘటనతో రాత్రివేళ అత్యవసర కేసులకు హాజరు కావాలంటేనే మహిళా వైద్యులు భయపడుతున్నారు. వారికి పూర్తి స్థాయిలో రక్షణ కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే మహిళా డాక్టర్ల రక్షణపై దృష్టి సారించాలి. –శివకుమార్, వైద్యాధికారి, మాధవరం పిహెచ్‌సీ, సిద్దవటం మండలం

కఠిన చట్టాలు అమలు చేయాలి



వైద్యుల పట్ల కఠినంగా వ్యవహరించడం మానుకోవాలి. మహిళా వైద్యులు, సిబ్బంది భద్రతకు కఠిన చట్టాలు అమలు చేయాలి. రాత్రి వేళల్లో ఆస్పత్రుల వద్ద పోలీసు పెట్రోలింగ్ నిర్వహించాలి. వైద్య సిబ్బందిపై దాడులకు పాల్పడితే విధించే శిక్షల వివరాలతో కూడిన బోర్డులను ప్రతి ఆస్పత్రిలోనూ ఏర్పాటు చేయాలి. –డాక్టర్ శివరామకృష్ణ, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, మదనపల్లె

సీసీ కెమెరాలు అమర్చాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో సీసీ కెమరాతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన ఘటన దారుణం.నిందతులను కఠినంగా శిక్షించాలి. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలి. –డాక్టర్ రిచర్డ్, వైద్యులు, సీహెచ్‌సి, తంబళ్లపల్లె

న్యూస్‌రీల్

సెప్టెంబర్‌లో జిల్లా స్థాయి యువజనోత్సవాలు

రాయచోటి (జగదాంబసెంటర్): జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అనుమతితో సెప్టెంబర్ నెలలో అన్నమయ్య జిల్లాలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు స్టెప్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సి.సాయిగ్రేస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పలు అంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. 15–29 ఏళ్ల వయస్సు గల యువతీ యువకులు సంబంధిత పోటీలలో పాల్గొనేందుకు సన్నద్ధం కావాలని కోరారు. వివరాలకు 9949298810, 98494 97045 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

కారుణ్య నియామకం

రాయచోటి: హోంగార్డు కారుణ్య నియామక పత్రాన్ని వి రాజ్యలక్ష్మికి జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అందజేశారు. అన్నమయ్య జిల్లాలో ఏడాది కిందట హోంగార్డు ఆది నారాయణ విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం రాయచోటీ ఎస్పీ కార్యాలయంలో మృతుడి భార్య వి రాజ్యలక్ష్మికి హోంగార్డు ఉద్యోగ నియామకపు ఉత్తర్వులను ఎస్పీ అందజేశారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

సుండుపల్లె: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కొండయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని ఓపీ, ఫార్మసీ, ల్యాబ్‌లలో సిబ్బంది హాజరు నమోదు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ కొండయ్య మాట్లాడుతూ డయేరియా, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారికి, ఆరోగ్య సిబ్బందికి సూచించారు..

ఫ్రీ హోల్డ్ భూములను గుర్తించాలి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి

నందలూరు: ఫ్రీ హోల్డ్ భూముల వివరాలను వీలైనంత త్వరగా గుర్తించాలని రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవి సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు. ఫ్రీ హోల్డ్ భూములపై సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ అమర్నాథ్, ఆర్ఐ సుశీల్, మండల సర్వేయర్ ఓబయ్య, విఆర్‌ఓలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

కన్ఫ్యూజ్ హోల్టింగ్స్‌కు బ్రేక్!

సాక్షి ఎఫెక్ట్..


రాజంపేట: ఒక రైలుకు ఒక స్టేషన్‌లో హోల్టింగ్ ఇస్తే..ఆ రైలు అప్,డౌన్‌లకు హోల్టింగ్ ఉన్నట్లే..అయితే గుంతకల్ డీవోఎం(కోచ్) పేరిట విడుదలైన ఉత్తర్వుల్లో హోల్టింగ్స్‌పై వింతవైఖరికి బుధవారం బ్రేక్‌పడింది. పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కన్ఫ్యూజ్ హోల్టింగ్ ఆర్డర్స్ జారీ చేసి ప్రయాణికులను గందరగోళంలోకి నెట్టివేశాయి. ప్రయాణికుల ఇబ్బందులపై గత నెల 28న 'దిక్కడం..సరే ఎక్కడం ఎలా'శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ విషయం ద.మరైల్వే ఉన్నతాధికారుల వర కు వెళ్లిన నేపథ్యంలో తాజాగా కన్ఫ్యూజ్ హోల్టింగ్స్‌ను నిలుపుదల చేస్తూ మరో సర్క్యులర్ జారీ చేసింది.

ఏయే రైళ్లకు...

తిరుపతి–కోల్హాపూర్(17415/17016)కు నందలూరు, ఓబులవారిపల్లె హోల్టింగ్‌ను పునరుద్ధరించారు. తిరుపతి–నిజాముద్దీన్ మధ్య నడిచే రాయలసీమ (12793/12794)రైలుకు ఓబులవారిపల్లె, రైల్వేస్టేషన్‌లో హోల్టింగ్ ఇచ్చారు. నందలూరులో ఈ రైలుకు హోల్టింగ్ ఇవ్వలేదు. తిరుపతి–విశాఖ మధ్య నడిచే తిరుమల ఎక్స్‌ప్రెస్ (17487/17488)రైలుకు నందలూరులో హాల్టింగ్‌ను పునరుద్ధరించారు. ఈ రైళ్ల హోల్టింగ్ ఈనెల 30 నుంచి అమలులోకివస్తాయని ఎస్సీ రైల్వే ప్రకటించింది. అలాగే జిల్లాలోని పీలేరు రైల్వేస్టేషన్‌లో కాచిగూడ–మధురై నడిచే వీక్లీ (22715/227160)రైలుకు వచ్చేనెల 7, 8 వ తేదీల నుంచి హోల్టింగ్ ఇచ్చారు. నాగర్‌కోయిల్ ఎక్స్‌ప్రెస్ (16339,/16340) రైలుకు ఈనెల 29, 2వతేదిలో హోల్టింగ్ ఇచ్చారు.

పచ్చగద్దలు!

టీడీపీ నేతల భూ దాహానికి చెరువులు మాయమవుతున్నాయి. చూస్తుండగానే ఖాళీ జాగాల్లో కంచెలు లేస్తున్నాయి. కొండలు.. గుట్టలు నిలువునా కరిగిపోతున్నాయి. జాగా కనిపిస్తే చాలు పాగా వేసేందుకు గద్దల్లా వాలిపోతున్నారు. నిబంధనలే కాదు చివరికి న్యాయస్థానాల ఆదేశాలూ పచ్చ నేతల అక్రమాలకు అడ్డుకట్ట వేయడం లేదు.



- వైఎస్‌ఆర్, అన్నమయ్య జిల్లాల్లో యథేచ్ఛగా భూ కబ్జాలకు పాల్పడుతున్న టీడీపీ నేతలు
- ఖాళీ జాగా కన్పిస్తే చాలు స్వాహాకు రంగం సిద్ధం...
- సుప్రీంకోర్టు ఉత్తర్వులున్నా బేఖాతర్... కుచించుకుపోతున్న చెరువులు



రెడ్డిపల్లె వద్ద డంపింగ్‌యాడ్ భూమిని ఆక్రమించి కంచె వేసిన దృశ్యం

సాక్షి ప్రతినిధి, కడప: గుట్టలు.. గుంటలు.. వాగులు...వంకలు.. ఏదీ వదలడం లేదు.. ఖాళీ జాగా కన్పిస్తే చాలు కంచెలేస్తున్నారు. పచ్చ గద్దల్లా మారి కబ్జా చేస్తున్నారు. అధికారం అండతో యథేచ్ఛగా స్వాహా చేస్తున్నారు. చివరికి సుప్రీంకోర్టు ఉత్తర్వులు సైతం పెడచెవిన పెడుతూ చెరువులనూ చెరబడుతున్నారు. ఈక్రమంలో వైఎస్‌ఆర్, అన్నమయ్య జిల్లాల్లో వందలాది ఎకరాలు ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. ఆక్రమణలకు అడ్డుకట్టగా నిలవాల్సిన రెవెన్యూ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోంది.

అన్నమయ్య జిల్లాలో..

జిల్లా కేంద్రమైన రాయచోటితోపాటు జిల్లాలోని రైల్వేకోడూరు నియోజకవర్గంలోభూ దందాలు హెచ్చుమీరాయి. ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని కంచెలు వేస్తున్నారు. రాయచోటిలోని 530 సర్వే నంబరులో సుమారు 3 ఎకరాల భూమిని కొంతమంది గుట్టుచప్పుడు కాకుండా చదును చేస్తున్నారు. అంతేకాకుండా రింగ్‌రోడ్డులో గతంలో ఎక్సైజ్‌శాఖ గడువు మీరిపోయిన మద్యం సీసాలన్నీ పగులగొట్టిన ప్రాంతంలో సుమారు 50 సెంట్ల రింగ్‌రోడ్డుకు ఆనుకుని ఉన్న స్థలాన్ని కబ్జా చేసేందుకు పావులు కదులుపుతున్నారు. అప్పట్లో ప్రభుత్వ అధికారులు నాటిన ఇది ప్రభుత్వం భూమి అనే బోర్డును కూడా తొలగించి భూమిని ఆక్రమించేందుకు పచ్చనేతలు యత్నాలు చేస్తున్నారు. కడప రింగ్‌రోడ్డు నుంచి వీరబల్లి రోడులో మొదట్లోనే ప్రభుత్వ భూములకు సంబంధించి బోర్డులను తొలగించి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అనువుగా మలుచుకుంటున్నారు. రింగ్‌రోడ్డు చుట్టూ ఉన్న ప్రభుత్వ భూముల్లో పాగా వేసి రికార్డులను తారుమారు చేస్తున్నారు.జిల్లాలోని పుల్లంపేట మండలంలో అయితే తెలుగుదేశం, జనసేన పార్టీల్లోని క్రియాశీలక నేతలు భారీ ఎత్తున భూములను చెరబట్టారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ దృష్టి పెడితే ప్రభుత్వ భూమిని పరిరక్షించుకోవచ్చు.

పుల్లంపేట మండలంలో..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పుల్లంపేట మండలంలోని తిప్పాయపల్లె, బావికాడపల్లె గ్రామాలలో యథేచ్ఛగా భూ ఆక్రమణలు కొనసాగాయి. సర్వే నంబరు 619, 622లలో 5 ఎకరాలు, 623లో 4 ఎకరాలు, సర్వే నంబరు 1450, 1451లలో 10 ఎకరాలు, 1452, 1453లలో 12.50 ఎకరాలు, 1455లో 5 ఎకరాలు, ఎస్ఆర్ పాలెంలో 82, 83లలో 10 ఎకరాలు, 1060లో 5 ఎకరాలు, రెడ్డిపల్లెలో 1206లో 4 ఎకరాలు ఆక్రమించుకున్నారు. కొమ్మనవారిపల్లెలో సైతం 20 ఎకరాల ప్రభుత్వ భూమిని ఒక మాజీ ప్రజాప్రతినిధి ఆక్రమించారు.

- వైఎస్‌ఆర్ జిల్లా మైదుకూరు నియోజకవర్గం తిప్పిరెడ్డిపల్లె పరిధిలోని గోడేరు చెరువులో 120 ఎకరాలుండేది. అందులో 50 ఎకరాలు అన్యాక్రాంతమైంది. టీడీపీ కార్యకర్తల కబ్జాలో ఉన్న ఆ భూమిలో పంటలు పండించుకుంటున్నారు. అదే గ్రామంలో 30ఎకరాల్లో ఉన్న వల్లూరమ్మ చెరువు 2 ఎకరాలకు పరితమైంది. సర్వే నంబర్ 77లో 4 ఎకరాలు కొండ పోరంబోకు చదును చేశారు. 138/సీలో కుంట పోరంబోకు చెందిన 12 ఎకరాలు సబ్ డివిజన్ చేయించుకుని పాస్‌బుక్‌లు కూడా తెచ్చుకున్నారు. సర్వే నంబరు 742, 743లో గయ్యాళిభూమి సైతం జేసీబీలు పెట్టి చదును చేశారు. తిప్పిరెడ్డిపల్లె పొలం సర్వే నంబరు 231లో స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు కేటాయించిన భూమిని కూడా పచ్చ నేతలు చదును చేశారు. చెరువులు, వాగులు, వంకలు అన్యాక్రాంతానికి పాల్పడడం చట్ట విరుద్ధమని, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులున్నాయి. పచ్చ గద్దల భూ దాహానికి అవన్నీ బేఖా తరవుతున్నాయి.

కోట్లాది విలువైన స్థలాలు సైతం....

వైఎస్సార్ జిల్లా బద్వేలు మున్సిపాలిటీ భాకరాపేట చెరువు సమీపంలోని చెన్నంపల్లె గ్రామ పొలం సర్వే నంబరు 1581లో చెరువు పోరంబోకు స్థలంలో సుమారు 50 సెంట్లపై టీడీపీ నేతలు కన్నేశారు. జేసీబీతో సదరు స్థలాన్ని చదును చేసి కబ్జాకు రంగం సిద్ధం చేశారు. లక్షలాది రూపాయలు విలువజేసే ఈ స్థలాన్ని కబ్జాకు తెర తీసినట్లు సమాచారం. అలాగే చెన్నంపల్లె గ్రామ పొలంలోని 1581 సర్వే నంబరులో చెన్నంపల్లె జగనన్న కాలనీకి సమీపంలో సుమారు 75 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని కూడా కబ్జా చేసేందుకు టీడీపీ నేతలు రంగం సిద్ధం చేశారు.

కబ్జా భూమి రక్షించుకునేందుకే....

వైఎస్‌ఆర్ జిల్లా ప్రొద్దుటూరు మండలం చౌడూరు గ్రామంలో గంగమ్మ ఆలయానికి సంబంధించిన 5.47 ఎకరాల భూమిని కబ్జా చేసేందుకు టీడీపీ నేతలు ప్రయత్నిస్తున్నారు. చాలా ఏళ్లుగా ఈ ఆలయం నిర్వహణ గ్రామానికి చెందిన సుబ్బయ్య కుటుంబీకులు చేపట్టేవారు. కాలక్రమేణా భూరికార్డులో పేరు మార్చి హస్తగతం చేసుకున్నారు. ఈ ఏడాది జనవరిలో ఆర్డీఓ శ్రీనివాసులు ఈ భూమిని దేవదాయశాఖకు చెందినదిగా తేల్చారు. ఎలాగైనా ఆ భూమిని దక్కించుకోవాలన్న దిశగా అడుగులు వేస్తున్నారు. అధికారపార్టీ నేతల సహకారంతో రికార్డులు మార్చిడికి యత్నిస్తున్నట్లు సమాచారం. కొండాపురం మండలం దత్తాపురం సి–బ్లాక్‌లోని బుక్కపట్నం కాలనీలో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు టీడీపీ నేతలు పోటీపడ్డారు. పరస్పరం దాడులు చేసుకున్నారు. ముందుగా తాను కంచె ఏర్పాటు చేస్తే తర్వాత మీరొచ్చారంటూ తెలుగుతమ్ముళ్ల మధ్య ఘర్షణకు దారితీసింది.

బ్యాంకర్ల భాగస్వామ్యంతోనే జిల్లా ఆర్థిక ప్రగతి

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



బ్యాంకర్లతో సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి : జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల భాగస్వామ్యం, సహకారం అవసరమని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీసీ హాలులో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా కన్సల్టేటివ్ కమిటీ, జిల్లా లెవెల్ రివ్యూ కమిటీ బ్యాంకర్స్ సమావేశాలను నిర్వహించారు. జిల్లాలోని అన్ని బ్యాంకులకు మొదటి త్రైమాసికం ముగిసే నాటికి నిర్దేశించిన పలు రకాల రుణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని ఆయా బ్యాంకుల ప్రతినిధులతో కలెక్టర్ కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో బ్యాంకుల నుంచి రుణాల మంజూరులో ఆర్థిక ప్రగతిని సాధించడం పట్ల కలెక్టర్ బ్యాంకర్లను అభినందించారు. జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి మొదటి త్రైమాసికం జూన్ 30వ తేదీ నాటికి జిల్లా క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.3,430 కోట్లకు రూ.4520.68 కోట్ల రుణాలు మంజూరు చేసి 131.79 శాతం ఆర్థిక ప్రగతిని సాధించడం జరిగిందన్నారు. ఇతర ప్రాధాన్యతా రంగాలలో రూ.478 కోట్లు మంజూరు చేస 41 శాతం ప్రగతి సాధించినట్లు వివరించారు. బ్యాంకర్లు సమర్థవంతంగా పనిచేస్తేనే ఆర్థిక వ్యవస్థ మరింత దృఢంగా ఉంటుందన్నారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ జి.ఆంజనేయులు మాట్లాడుతూ డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశానికి సంబంధించిన అజెండాను కలెక్టర్‌కి వివరించారు. డిగ్రీ విద్యార్థులు క్విజ్ పోటీల్లో పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించి ప్రచురించిన కరదీపికలను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్, ఎస్బీఐ ఆర్ఎం పి.మురళీనాయక్, నాబార్డ్ ఏజీఎం విజయ్‌విహారి, ఆర్బీఐ ఎల్డీం నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్ల తిరస్కరణపై విచారణ

మదనపల్లె: మండలంలో గతంలో జారీచేసిన సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్ల తిరస్కరణపై వీఆర్వోలు క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ ఆదేశించారు. బుధవారం తహసీల్దార్ ఖాజాబీతో కలిసి మండలంలోని పోతపోలు, కొత్తవారిపల్లె పంచాయతీల్లో సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్ల తిరస్కరణకు గురైన దరఖాస్తులను పరిశీలించారు. మదనపల్లె మండలంలో 6,000 క్యాస్ట్ సర్టిఫికెట్లు తిరస్కరణకు గురయ్యాయని, ఎందుకు తిరస్కరించారో కారణాలను కనుక్కుని, అర్హత కలిగిన వారికి మంజూరు చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

కేసుల్లో పురోగతి సాధించాలి

ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి: కేసుల్లో పురోగతి సాధించి తప్పు చేసిన వారికి శిక్షపడేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు జిల్లా పోలీస్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయంలో నెలవారి నేర సమీక్ష సమావేశాన్ని ఎస్పీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని రాయచోటి, మదనపల్లె, రాజంపేట డివిజన్ల డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దర్యాప్తు అధికారులు నేరం చేసిన వ్యక్తిని గుర్తించి వెంటనే అరెస్టు చేయాలన్నారు. తరచూ దొంగతనాలు, దారి దోపిడీలు, చైన్ స్నాచింగ్ వంటి నేరాలు జరిగే ప్రాంతాలను గుర్తించాలన్నారు. ఎస్‌డీపీఓలు ప్రత్యేక దృష్టి పెట్టి ఎన్ఫోర్స్‌మెంట్ విధులను పెంచి నేరాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. పాక్సో కేసులకు సంబంధించిన నిందితులపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాల న్నారు.వాహనాల తనిఖీలు చేపట్టి చలానాలు విధిస్తూ వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించేలా చేయాలన్నారు. రాత్రి వేళల్లో గస్తీ పెంచి దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు కేసుల ఛేదనలో అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని ఎస్పీ తెలిపారు. పెరుగుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని కిందిస్థాయి అధికారులకు సూచించారు. వివిధ సమస్యలపై ఫిర్యాదు చేయడానికి స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలగాలని ఎస్పీ పేర్కొన్నారు.

కలమల్లకు తెలుగు వెలుగు

- తెలుగు భాషా దినోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు
- తెలుగు శాసనానికి శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటుకు భూమి పూజ
- ఉత్సవాలకు హాజరుకానున్న ప్రముఖులు, ప్రజాప్రతినిధులు



కలమల్లలో తెలుగుభాషా దినోత్సవాల కోసం ఏర్పాటు చేసిన శిబిరం

ఎర్రగుంట్ల: వైఎస్ఆర్ జిల్లా కలమల్ల గ్రామానికి కొత్త వెలుగొచ్చింది. తొలి తెలుగు శాసనం లభించిన ఈ ఊరిలో తెలుగు భాషా దినోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. గురువారం నిర్వహించనున్న ఈ వేడుకలకు స్థానిక శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. తెలుగు భాషా దినోత్సవ ఏర్పాట్లపై కలెక్టర్ శివశంకర్ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సభ్యులు ఈ ఏర్పాట్లను పర్యవేక్షించారు. శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక గ్రానైట్ రాళ్లతో చప్పటను వేశారు. అంతేకాక తెలుగు శాసనానికి శాశ్వత ప్రాతిపదికన కోసం భూమి పూజ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ వేడుకలతో కలమల్ల గ్రామ చరిత్ర ..కీర్తి ప్రతిష్టలు నలమూలలా విస్తరించనున్నాయి. ఈ సందర్భంగా నియోజకవర్గం పరిధిలోని అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు రానున్నారు. అలాగే క్విజ్ పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానోత్సవం ఉంటుంది.

వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం

ఈ ఉత్సవాలకు ముఖ్య ప్రజాప్రతినిధులు, అధికారులు రానున్నారు. ఈ మేరకు కలమల్ల ఎస్ఐ తిమోతి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని భద్రత ఏర్పాట్లు చేశారు. అలాగే ఆర్టీపీపీ రోడ్డుకు వెళ్లే శ్రీ అంకాలమ్మ దేవాలయ సమీపంలోని ఖాళీ స్థలంలో వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేశారు.

నేడు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు రాక

కలమల్లలో జరిగే తెలుగుభాష దినోత్సవాలకు ముఖ్య అతిథిగా భారతదేశ మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు రానున్నారు బుధవారం ఉదయం 6 గంటల 20 నిమిషాలకు హైదరాబాదులోని రాజీవ్‌గాంధీ విమానాశ్రయం నుంచి బయలుదేరి 7.45కు తిరుపతి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు, అక్కడ నుంచి రోడ్డు మార్గాన రేణిగుంట రైల్వేస్టేషన్‌కు చేరుకోంటారు. 9.20 గంటలకు రేణిగుంట రైల్వేస్టేషన్‌లో రైలులో బయలుదేరి మధ్యాహ్నం 11.35 కు యర్రగుంట్ల రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారు. 11.45కు రోడ్డు మార్గాన బయలుదేరి మధ్యాహ్నం 12.15కు కలమల్లకు చేరుకుంటారు. అనంతరం మధ్యాహ్నం 2.25 కు తిరుగు పయనమవుతారు.

ప్రత్యేక రక్షణ కల్పించాలి



రాత్రింబవళ్లు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర సమయాల్లో ప్రజలకు వైద్యం అందించి ప్రాణాలు నిలబెట్టే వైద్యులకు ప్రభుత్వాలు రక్షణ కల్పించాలి. రాత్రి సమయంలో డ్యూటీలో ఉన్న మహిళా వైద్యులకు ఆకతాయిల నుంచి ఎలాంటి ప్రమాదం కలగకుండా రక్షణ కల్పించాలి.

– పార్థసారథి రెడ్డి, వైద్య సిబ్బంది, ముక్కావారిపల్లె, ఓబులవారిపల్లె

వైద్యులకు భరోసా కల్పించాలి



వైద్యులు భయంతో విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఉండకూడదు. వైద్యులపై దాడి చేయాలన్నా, అమానవీయంగా వ్యవహరించాలన్నా భయమేయాలి. కఠినమైన చట్టాలు చేస్తేనే వైద్యులు, వైద్య సిబ్బంది ప్రశాంతంగా పని చేయగలుగుతారు. ప్రభుత్వాలు స్పందించి మహిళా వైద్యులు, వైద్య సిబ్బంది రక్షణకు కఠినమైన చట్టాలు చేయాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ ప్రసాద్‌రాజు, ఆర్ఎంఓ, జిల్లా ఆస్పత్రి, మదనపల్లె.



కఠిన శిక్షలు విధించాలి



మహిళా వైద్యులు, వైద్యసిబ్బందిపై తరచూ జరుగుతున్న లైంగిక దాడుల ఘటనపై జాతీయ స్థాయిలో పటిష్టమైన చట్టాన్ని తీసుకురావాలి. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నిరంతరం సేవలందిస్తున్న వైద్యులపై జరిగే దాడులను తీవ్రంగా పరిగణించాలి. కోల్‌కతా వంటి ఘటనలు జరిగినప్పుడు నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసి కఠినశిక్షలు విధించాలి. – లక్ష్మి, స్టాఫ్‌నర్సు, రాజంపేట

వైద్యులకు రక్షణ లేకుండా పోయింది



దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా మెడికల్ వైద్య కళాశాల విద్యార్థిని అంశంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదు. ట్రైనీ డాక్టర్ హత్యకేసు విషయంలో నిందితులు ఎంతటివారైనా సరే ఉపేక్షించకుండా కఠినంగా శిక్షించాలి. దేశంలో వైద్యులకు రక్షణ లేకుండా పోయింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. మహిళా డాక్టర్లకు రక్షణ కల్పించే విధంగా దేశవ్యాప్తంగా ప్రత్యేకంగా భద్రతా చట్టం అమలు చేయాలి.

– డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్, ప్రభుత్వ వైద్యాధికారి, నందలూరు

క్లుప్తంగా

కోర్టు ఆదేశాలతో ప్రహరీ కూల్చివేత



సుండుపల్లె : ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని నిర్మించిన ప్రహరీని కోర్టు ఆదేశాలతో కూల్చివేశారు. సుండుపల్లె పంచాయతీ బుర్రలదిన్నె గ్రామంలో సర్వే నంబరు. 394లో భూమారపు జయరామకు 2.56 సెంట్ల భూమి ఉంది. ఈయన భూమి పక్కన సర్వే నంబరు 395లో వంక పొరంబోకు 15 సెంట్లు దారి ఉంది. దారి పక్కన భూమారపు రామాంజులుకు సర్వే నంబరు 509లో 04.22 సెంట్లు భూమి ఉంది. తన ఇంటి దగ్గర 01 సెంటు భూమిని రామాంజులు ఆక్రమించి ప్రహరీ నిర్మించున్నాడని జయరాం హైకోర్టులో కంటెంట్ పిటిషన్ వేశారు. కోర్టు ఉత్తర్వుల మేరకు పంచాయతీ సెక్రటరీ సురేష్ బాబు, పోలీసు, రెవెన్యూ సిబ్బంది గోడ కూల్చివేశారు. ఈ కార్యక్రమంలో రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

13 మంది జూదరుల అరెస్టు

మదనపల్లె : వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 13 మంది జూదరులను అరెస్ట్ చేసినట్లు సీఐ చాంద్‌బాషా తెలిపారు. కోళ్లబైలు పంచాయతీ కాట్లాటపల్లెరోడ్డులో కొందరు జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ అన్సర్‌బాషా సిబ్బందితో కలిసి దాడి చేశారన్నారు. ఈ దాడిలో మదనపల్లె పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన 13మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారివద్ద నుంచి రూ.15,720 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

నాబార్డు నిధులను మింగేశారు!

– పూర్తి స్థాయి విచారణకు త్రిమెన్ కమిటీ

కురబలకోట : కురబలకోట జెడ్పీ హైస్కూల్‌లో నాబార్డు కింద జరిగిన పనుల్లో నిధులు గోల్‌మాల్ అయినట్లు వెల్లడవుతోంది. చేసిన పనుల కన్నా రూ. 5 లక్షలు అధికంగా డ్రా చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఇటీవల ఎన్నికైన కొత్త కమిటీ ఫిర్యాదు చేసింది. దీంతో బుధవారం డీవైఈఓ పురుషోత్తం హైస్కూల్‌లో విచారణ జరిపారు. మరుగుదొడ్లు సహా ఇతర అసంపూర్ణ పనులను పరిశీలించారు. చేయని పనులకు కూడా బిల్లులు డ్రా చేసినట్లు ప్రాథమికంగా వెల్లడైంది. ఈ విషయమై హెడ్మాస్టర్‌ను విచారించారు. చేసిన పనుల కన్నా రూ.5 లక్షలు అదనంగా డ్రా అయినట్లు అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. దీనిపై పూర్తి స్థాయి విచారణకు డీవైఈఓ, ఎంఈఓ, సమగ్ర శిక్ష డీఈని త్రిమెన్ కమిటీ సభ్యులుగా నియమించారు.

సీమ భాషా సాహితీవేత్తలకు అన్యాయం

- నన్నెచోడునికి దక్కని ఆదికవి హోదా
- బ్రౌన్‌కు పాఠ్యాంశాల్లో దక్కని చోటు
- పుట్టపర్తికి దక్కని జ్ఞానపీఠం
- కట్టమంచిని విస్మరించిన ప్రభుత్వం
- ఓట్ల రాజకీయాలకు పెద్దపీట



కడప సెవెన్‌రోడ్స్ : తొలి తెలుగు శాసనం లభించిన ఎర్రగుంట్ల మండలం కలమల్లలో గురువారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి నిర్ణయించడం ఎంతో ముదావహం. గతంలో ఎవరికీ రాని ఇలాంటి ఆలోచన కలెక్టర్‌కు రావడం అభినందించాల్సిన విషయం. ఈ నిర్ణయం పట్ల జిల్లాలోని తెలుగుభాషాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అదే సందర్భంలో రాయలసీమ భాషా సాహితీవేత్తలకు తరాలుగా జరుగుతున్న అన్యాయాన్ని పలువురు సాహితీవేత్తలు ఎత్తి చూపుతున్నారు. అదేమిటో చూద్దాం..

నన్నెచోడుడు

కడపజిల్లా పొత్తపినాడుకు చెందిన కవి. కుమారసంభవం అనే కావ్యాన్ని రాశారు. కాళిదాసు రచనలోని ఇతివృత్తాన్ని మాత్రమే తీసుకుని రాశారు. తెలుగు సాహిత్య రంగంలో నన్నయ్య కన్నా ముందువాడైన నన్నె చోడుడు 925–40 మధ్యకాలం వారని తెలుస్తోంది. నన్నెచోడుడు రాసిన కుమార సంభవం కావ్యాన్ని కనుగొని పరిష్కరించి వెలుగులోకి తీసుకొచ్చిన ఘనత సుప్రసిద్ధ సాహితీ పరిశోధకుడు, కవి, సంస్కృతాంధ్ర పండితుడు, బహుభాషా కోవిదుడైన మానవల్లి రామకృష్ణ కవికి దక్కుతుంది. అప్పటివరకు తెలుగు సాహిత్యంలో నన్నెచోడుడు అనే కవి ఉన్నారనే విషయమే ఎవరికీ తెలియదు. తంజావూరులోని సరస్వతి మహల్ గ్రంథాలయంలో ఒక మూలపడి ఉన్న కుమార సంభవం తాళపత్ర గ్రంథాన్ని రామకృష్ణ కవి కనుగొన్నారు. దాన్ని పరిష్కరించి 1909లో ప్రకటించారు. నన్నెచోడుడు నన్నయ్య కంటే ముందువాడని శాసనాధారాలతో ప్రకటించారు. రామకృష్ణ కవి చేసిన ప్రతిపాదన పండిత లోకాన్ని ఎంతో ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ ప్రతిపాదనపై చర్చోపచర్చలు, వాదోపవాదాలు వాడిగా వేడిగా జరిగాయి. చిలుకూరి వీరభద్ర రావు, వేటూరి ప్రభాకరశాస్త్రి, జయంతి రామయ్య పంతులు, పింగళి లక్ష్మీకాంతం, నిడదవోలు వెంకటరావు, ఆరుద్ర మొదలైన వారు దీన్ని వ్యతిరేకించారు. రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, పుట్టపర్తి నారాయణచార్యులు వంటి వారు మానవల్లి ప్రకటనను సమర్థించారు. మల్లంపల్లె సోమశేఖరశర్మ సరసన చెప్పుకోదగ్గ ప్రముఖ శాసన పరిశోధకులు, హైదరాబాదుకు చెందిన బీఎన్ శాస్త్రి కుమార సంభవంపై పరిశోధన చేసి నన్నయ్య కన్నా నన్నెచోడుడే ముందు వాడని శాసన ఆధారంగా నిరూపించారు. కందుకూరి వీరేశలింగం రాసిన ఆంధ్ర కవుల చరిత్రలో ఈ విషయానికి సంబంధించిన శాసనం ఉందంటూ పేర్కొనడం విశేషం. నన్నయ్యకే ఆదికవి హోదా దక్కాలనే కోస్తా ప్రాంతానికి చెందిన సాహితీవేత్తల అభిప్రాయానికే ప్రభుత్వాలు విలువనిచ్చాయి. నన్నెచోడుడికి ఆది కవి హోదా లభించక ఈ ప్రాంతానికి తీరని అన్యాయం జరిగింది.

కట్టమంచి

ఆధునిక సాహితీ విమర్శకు ఆద్యుడు, ప్రతిభావంతుడైన సాహితీవేత్త, వక్త, ఆర్థిక శాస్త్రవేత్త, హేతువాది, రాజనీతిజ్ఞుడు కట్టమంచి రామలింగారెడ్డి. కవిత్రతత్వ విచారణ, అర్థశాస్త్రం, ముసలమ్మ మరణం ఆయన రాసిన గ్రంథాల్లో ఎంతో పేరు గాంచాయి. మైసూరు రాజ్య విద్యాశాఖ అధికారిగా ఉన్న సమయంలో దళితులకు విద్యావకాశాలు కల్పించారు. ఆయన ప్రణాళిక ఆధారంగానే మైసూరు విశ్వవిద్యాలయం రూపుదిద్దుకుంది. ఆ తర్వాత రాజకీయాల్లో ప్రవేశించి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా పనిచేశారు. ఆంధ్రులకు ఒక విశ్వవిద్యాలయం ఉండాలంటూ నాటి మద్రాసు శాసనసభలో ఎన్నో ప్రసంగాలు చేశారు. ఆయన కృషితో ఏర్పడిన ఆంధ్ర విశ్వవిద్యాలయానికి మొదటి ఉప కులపతిగా పనిచేశారు. కానీ ఆయన్ను నేడు అనుకునే దిక్కే లేదు.

సీపీ బ్రౌన్

తెలుగు భాషా సాహిత్యాల సముద్ధరణకు జీవితాంతం అవిరళ కృషి చేసిన మహనీయుడు సీపీ బ్రౌన్. తాళపత్ర గ్రంథాలు, కావ్యాలు, శతకాలు, వేమన పద్యాలను సొంత ఖర్చులతో సేకరించారు. పండితులకు సొంతంగా జీతాలు ఇచ్చి శుద్ధ ప్రతులను కాగితాలపై రాయించారు. కొన్నింటికి వ్యాఖ్యానాలు రాయించి ముద్రించారు. వేమన పద్యాలను ఆంగ్లంలోకి అనువదించి తెలుగు కీర్తిని విశ్వవ్యాప్తం చేశారు. తెలుగు వ్యాకరణం, నిఘంటువులు, నిత్యం పరిపాలన వ్యవహారాల్లో ఉపయోగించే రెవెన్యూ జ్యుడిషియల్ పదజాలాన్ని సేకరించి నిఘంటువు తయారు చేశారు. ఆయన కృషి లేకపోతే నేడు తెలుగు భాషా సాహిత్యాలు ఈ స్థితిలో ఉండేవి కావు. అలాంటి మహానుభావుడి గురించి పాఠ్యాంశాల్లో చేర్చకపోవడం విచారకరం. సీపీ బ్రౌన్ పేరిట కనీసం పురస్కారాలు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని ఈ ప్రాంత సాహితీవేత్తలు కోరుతున్నారు.

పుట్టపర్తి

శ్రీకృష్ణ దేవరాయల రాజగురువు తాతాచార్యుల వంశానికి చెందిన పుట్టపర్తి నారాయణాచార్యులు కడప నగరానికి చెందిన వారు. ఆధునిక మహాకావ్యంగా పలువురు పండితులు అభివర్ణించే శివతాండవం సృష్టికర్త. జనప్రియ రామాయణం, మేఘదూతం వంటి గేయ కావ్యాలు రాశారు. అనేక భాషలు తెలిసిన వ్యక్తిగా పీవీ నరసింహారావు పేరు మారుమోగుతోంది గానీ పుట్టపర్తి పేరు అంతగా వినిపించదు. తుళు, ఫ్రెంచ్, పర్షియన్, అవధీ, బ్రిజ్, కన్నడ, మళయాళ, మరాఠీ, సంస్కృతం, ఇంగ్లీషు వంటి 14 భాషల్లో పాండిత్యం సాధించిన దిట్ట పుట్టపర్తి. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, శ్రీకృష్ణ దేవరాయల విశ్వవిద్యాలయం ఆయనకు డి.లిట్ ప్రదానం చేశాయి. భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని అందించింది. నిజానికి ఆయన జ్ఞానపీఠ అవార్డుకు అర్హులు. కడపలో సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని ప్రారంభించేందుకు వచ్చిన డాక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ 'నిజానికి తనకన్నా ముందే నారాయణాచార్యులకు జ్ఞానపీఠం రావాల్సి ఉండేది' అన్నారు. పుట్టపర్తి ముక్కుసూటి మనిషి. లాబీయింగ్ చేయడం చేతగాదు గనుకే ఆ పురస్కారం ఆయనకు దక్కలేదని ఈ ప్రాంత సాహితీవేత్తల అభిప్రాయం.

ఓట్ల రాజకీయాలకు పెద్దపీట

ప్రతిభావంతులైన భాషా సాహితీవేత్తలను గుర్తించి పురస్కారాలను అందించడం ద్వారా గౌరవించని ప్రభుత్వాలు ఓట్ల రాజకీయాలకు పెద్దపీట వేస్తున్నాయి. రాయలసీమలో ఎంతోమంది ప్రజ్ఞావంతులు ఉన్నప్పటికీ గుర్తింపు లేకుండా పోయింది. డబ్బు, కులం, ఓట్లు తదితర అంశాల ప్రాతిపదికగానే పురస్కారాలు ప్రదానం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ పథకాలకు కూడా రాయలసీమ ప్రముఖుల పేర్లు పెట్టడం లేదు. తెలుగు సంస్కృత అకాడమికి కట్టమంచి రామలింగారెడ్డి పేరు పెట్టాలనే డిమాండ్ చాలాకాలంగా ఉన్నా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. రాయలసీమ ప్రాంతానికి చెందిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ అంశంపై దృష్టి సారించి ఇప్పటికైనా న్యాయం చేయాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

'సీమ'పై వివక్ష తగదు



నన్నెచోడుడు నన్నయ్య కన్నా ముందువాడనే వాదనపై ప్రభుత్వం ఒక నిపుణుల కమిటీ నియమించి నిగ్గు తేల్చాలి. ఇందుకు సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని కేంద్ర స్థానంగా చేసుకోవాలి. అన్నమయ్యలోని సంఘ సంస్కరణ భావాలు, ఆయన స్థానిక పద ప్రయోగాలు, తిరుగాడిన స్థలాలు వంటివి పరిశోధించడానికి ఒక ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయాలి. నాచన సోముని వంటి అనేక మంది రాయలసీమ కవులకు గుర్తింపు లేకుండా పోయింది. వేమన, పోతులూరి వీరబ్రహ్మం ప్రాచీన కాలంలో సంఘ సంస్కరణ కవులు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో వీరి సాహిత్యం మీద పరిశోధనలను ప్రోత్సహించాలి. కట్టమంచి, పుట్టపర్తి లాంటి వారికి ఏమాత్రం గుర్తింపు లేకుండా పోయింది. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని రాయలసీమలోనే గొప్ప పరిశోధన కేంద్రంగా అభివృద్ధి చేయాలి. భాషా పరిశోధకులు, నిఘంటువు నిర్మాతలు, కావ్య పరిష్కర్తలు, వ్యాఖ్యాతలకు సీపీ బ్రౌన్ పేరిట పురస్కారాలు అందించాలి. తొలి తెలుగు కవయిత్రి మొల్ల, తాళ్లపాక తిమ్మక్క, తరిగొండ వెంగమాంబలకు గుర్తింపు వచ్చేటట్లు పరిశోధనలు ప్రోత్సహించాలి.

– రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, అధికార భాషా సంఘం మాజీ సభ్యులు

నన్నెచోడుడే ఆది కవి



నన్నెచోడుడు 940 ప్రాంతం వాడని, నన్నయ్య కంటే ముందు తరం వాడని మానవల్లి రామకృష్ణ కవి ఆధార సహితంగా నిరూపించారు. ఆయనకు లభించిన కర్ణాటకలోని కుడుంబలూరు శాసనం, శుద్ధ ద్రావిడ దేశంలో లభించిన బీచుపల్లి శాసనం, పేరు తెలియని మరొక తెలుగు శాసనం ద్వారా ఆయన ఈ నిరూపణ చేశారు. దీన్ని కోస్తా ప్రాంత సాహితీవేత్తలు తీవ్రంగా వ్యతిరేకించారు. కొర్లపాటి శ్రీరామమూర్తి మరో అడుగు ముందుకేసి కుమార సంభవం నన్నెచోడుడు రచన కాదని, అది మానవల్లి రామకృష్ణ కవే రచించి నన్నెచోడుని పేరు ప్రకటించారనే తీవ్ర ఆరోపణలు చేశారు. రామకృష్ణ కవి నన్నయ్యను ఆదికవి హోదా నుంచి తప్పించి నన్నెచోడుడు ఆ స్థానంలో కూర్చోబెట్టే ప్రయత్నంగానే కుమార సంభవాన్ని రాశాడని నిరాధార ఆరోపణలు చేశారు. కోస్తా ప్రాంత సాహితీవేత్తలకు తొలి నుంచి రాయలసీమ అంటే గిట్టని తనమే ఇందుకు కారణమని భావించవచ్చు. నన్నెచోడునికే ఆది కవి హోదా దక్కాలి.

– డాక్టర్ పొదిలి నాగరాజు, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ పురుషుల కళాశాల, కడప

పోలీసులకు సేవా పతకాలు

రాయచోటి : విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులకు పోలీసు సేవా పతకాలు, కమెండేషన్ డిస్క్ సర్టిఫికెట్లను జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు బుధవారం జిల్లా ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రదానం చేశారు.

పతకాలు పొందిన వారు..

కంటగాని రామ్ మోహన్ ఎస్ఐ, బి కొత్తకోట పోలీస్ స్టేషన్, సి రామాంజనేయులు ఏఎస్ఐ ఎస్పీ ఆఫీసు, ఎస్ లక్ష్మీనారాయణ హెడ్ కానిస్టేబుల్, ఎస్పీ ఆఫీసు, ఎం శివరామకృష్ణయ్య, హెడ్ కానిస్టేబుల్, నిమ్మనపల్లి పోలీస్ స్టేషన్, డి మహేంద్ర, పోలీస్, రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్, లెక్కల రామాంజనేయరెడ్డి, పోలీసు, మన్నూరు పోలీస్ స్టేషన్, షేక్ సిరాజ్ బాషా పోలీసు, మొలకల చెరువు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వారు పతకాలు పొందారు.అలాగే పసుపులేటి మల్లికార్జున చిన్నమండెం పోలీస్ స్టేషన్‌లో పోలీసుగా విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించిన కారణంగా ఆయన సతీమణి మాధవికి జిల్లా ఎస్పీ పతకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌డీఎస్పీ చిన్న కృష్ణ, ఆర్ఐ వెంకటాచలపతి తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె టీడీపీలో రచ్చ రచ్చ



జయచంద్రారెడ్డిపై మంత్రి మండిపల్లికి ఫిర్యాదు చేస్తున్న ముఖ్యనేతలు



జయచంద్రారెడ్డికి మద్దతుగా సమావేశం నిర్వహించిన నాయకులు

- దాసరిపల్లి పనితీరుపై మండిపల్లికి ఫిర్యాదు
- ముఖ్యనేతలంతా ఏకమై తిరుగుబాటు
- అధిష్టానానికి పరస్పర ఫిర్యాదులు
- ఇన్‌చార్జి తేల్చకుండా చిచ్చురేపిన చంద్రబాబు

బి.కొత్తకోట : అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ రచ్చకెక్కింది. వర్గాలుగా విడిపోయిన నేతలు, కార్యకర్తలు ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలతో విరుచుకుపడుతున్నారు. మొన్నటిదాకా గ్రామ స్థాయి, పార్టీ పదవులు కలిగిన నాయకులు దాసరిపల్లి జయచంద్రారెడ్డిపై ఫిర్యాదులు చేస్తూ వచ్చారు. ఎవరూ ఊహించని విధంగా నియోజకవర్గంలోని ముఖ్యనేతలు, మండల కన్వీనర్లు ఏకతాటిపైకి వచ్చి మంగళవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షునికి ఫిర్యాదు చేయగా, బుధవారం జిల్లా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. కీలకమైన, ముఖ్యనేతలంతా ఏకమై తిరుగుబాటు చేయడంతో టీడీపీ రాజకీయాలు రసవత్తరంగా మారాయి. దీనిపై జయచంద్రారెడ్డి వర్గీయులు బి.కొత్తకోటలో సమావేశం పెట్టి ఫిర్యాదులపై ప్రత్యారోపణలు చేశారు. దీంతో పార్టీలో విభేదాలు, వర్గపోరు గాలివానగా మారింది. 2009లో ప్రవీణ్ చేతిలో ఓడిపోయిన జి.శంకర్‌యాదవ్ (కాంగ్రెస్)ను పార్టీలో చేర్చుకుని టికెట్ ఇవ్వడంతో 2014లో గెలిచారు. అప్పటినుంచి ఆయనే టీడీపీ నేత కావడంతో 2024 ఎన్నికల్లో టికెట్ తనదే అన్న ధీమాలో ఉన్న శంకర్‌కు చంద్రబాబు షాక్ ఇచ్చి రాజకీయాలకు కొత్త అయిన జయచంద్రారెడ్డికి టికెట్ ఇవ్వగా పరాజయం పాలయ్యారు.

ఓటమిపై ఫిర్యాదుతో మొదలు

ఎన్నికలయ్యాక జయచంద్రారెడ్డి తన ఓటమికి ఎవరెవరు కారకులు, ఎవరెవరు తన గెలుపునకు పనిచేయలేదో వారి వివరాలతో అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. ఇది పుండుమీద కారం చల్లినట్టయింది. ఎన్నికల్లో తమను నిర్లక్ష్యం చేయడమేకాక ఫిర్యాదు చేస్తారా అని ఆవేదనకు గురయ్యారు. దీని తర్వాత ఒక్కొక్కటిగా ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడం మొదలైంది. జయచంద్రారెడ్డికి ఇన్‌చార్జి పదవి అప్పగించొద్దంటూ ఆయన్ను వ్యతిరేకించే నేతలు ఫిర్యాదులు చేస్తుండగా, వీరిపై జయచంద్రారెడ్డి వర్గీయుల పరస్పర ఫిర్యాదులతో వీధిన పడ్డారు.

ముఖ్యనేతల తిరుగుబాటు

జయచంద్రారెడ్డిని వ్యతిరేకిస్తున్న నియోజకవర్గానికి చెందిన ముఖ్య నేతలు, కన్వీనర్లు, జిల్లాస్థాయి నేతలు ఏకతాటిపైకి వచ్చారు. నాయకులు, కార్యకర్తలకు గౌరవం లేకపోవడం, కనీసం పట్టించుకోకపోవడం, ఇటీవల నెలకొన్న ఇక్కడి పరిస్థితులను చంద్రబాబు, లోకేష్, మంత్రులు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావుల దృష్టికి తీసుకెళ్లేందుకు నిర్ణయించి మంగళవారం మంగళగిరిలో ఆరు పేజీల ఫిర్యాదు అందించడం కీలకంగా మారింది. ఈ ఫిర్యాదులో అనేక విషయాలు ఉన్నట్టు సమాచారం. సీనియర్లు, ముఖ్యలంతా ఏకమై ఫిర్యాదు చేయడంతో ఏం జరుగుతోందని, తంబళ్లపల్లె నుంచి అత్యధిక ఫిర్యాదులు వస్తున్నాయని పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

మంత్రికి ఫిర్యాదు

అమరావతిలో బుధవారం జయచంద్రారెడ్డి తీరును ఎండగడుతూ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి నియోజకవర్గానికి చెందిన టీడీపీ ముఖ్య నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల కన్వీనర్లు ఫిర్యాదు చేశారు. అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుంచి కార్యకర్తలు, నాయకుల పరిస్థితి, అధికారంలోకి వచ్చాక నెలకొన్న పరిస్థితులపై నివేదికను అందించారు. అధిష్టానానికి తమ సమస్యను తెలిపి న్యాయం చేయాలని కోరారు. ఇవే పరిస్థితులు కొనసాగితే పార్టీ శ్రేణులకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

వ్యతిరేక వర్గంపై ఆగ్రహం

జయచంద్రారెడ్డిపై ఆయన వ్యతిరేకులు చేస్తున్న ఫిర్యాదులపై బుధవారం బి.కొత్తకోటలో ఆయనకు మద్దతు ఇస్తున్న నాయకులు సమావేశం నిర్వహించారు. కొందరు మండల కన్వీనర్లు, నాయకులపై ఆరోపణలు చేశారు. ఎన్నికల్లో డబ్బు ఇస్తే పంచలేదని, జయచంద్రారెడ్డి ఓటమికి పనిచేశారంటూ ఆరోపించారు. కార్యకర్తలు, నాయకులకు అండగా నిలుస్తున్నారని అన్నారు. ఓ మాజీ ఎమ్మెల్యే కోసం ఆరోపణలు, ఫిర్యాదులు చేయడం మానుకోవాలంటూ పరోక్ష హెచ్చరికలు చేశారు.

ఓడితే ఇన్‌చార్జి లేదన్న బాబు

ఎన్నికల్లో ఓడిపోతే నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగించమని చంద్రబాబు స్పష్టంగా పేర్కొన్నారు. ఓటింగ్‌కు కొన్నిరోజుల ముందు తంబళ్లపల్లె నియోజకవర్గ పార్టీ క్యాడర్‌తో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల్లో గెలవాలని, ఓడిపోతే ఇన్‌చార్జిగా ఉంచబోమని అప్పుడే స్పష్టం చేశారు. అయితే ఇన్‌చార్జి ఎవరో ప్రకటించకపోవడంతో చంద్రబాబే వర్గపోరుకు ఆజ్యం పోశారని పార్టీనేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్ర గాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన బి.వెంకటేష్(58) మార్కెట్‌యార్డు వద్ద అన్న క్యాంటీన్‌కు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఆటో ఢీకొంది. ప్రమాదంలో వెంకటేష్ తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

జింక అడ్డు రావడంతో..



తీవ్రంగా గాయపడిన ఈశ్వరయ్య

జింక రోడ్డుకు అడ్డుగా రావడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. కోటావూరుకు చెందిన ఈశ్వరయ్య(55) ద్విచక్రవాహనంలో పొలం వద్దకు వెళుతుండగా, మార్గమధ్యంలోని పెద్దపాలెం గేటువద్ద అకస్మాత్తుగా జింక రోడ్డుకు అడ్డుగా రావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వివాహానికి వెళ్లి వస్తుండగా..

వాల్మీకిపురం మండలం బూడిదవేడుకు చెందిన దేవేంద్ర(30) చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లెలో జరుగుతున్న బంధువుల వివాహానికి మంగళవారం వెళ్లాడు. బుధవారం తిరిగి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో వస్తుండగా, మార్గమధ్యంలోని నిమ్మనపల్లె మండలం ముష్టూరు పంచాయతీ మర్రిబండ మలుపువద్ద వాహనం అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా బాధితుడిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రాష్ట్రంలో అరాచక పాలన



జెడ్పీటీసీల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రవీంద్రనాథరెడ్డి, ఆకేపాటి, రఘురామిరెడ్డి, కొరముట్ల

రాజంపేట : ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఉమ్మడి వైఎస్సార్ జిల్లాల అధ్యక్షులు రవీంద్రనాథరెడ్డి, ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాజంపేట మండలం ఆకేపాడులోని ఆకేపాటి ఎస్టేట్‌లో జెడ్పీటీసీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమికి అధికారం ఇచ్చి తప్పు చేశామనే భావనకు ప్రజలు వచ్చేశారన్నారు. ప్రజలకు మేలు చేయకుండా కేవలం వైఎస్సార్‌సీపీ టార్గెట్‌గా పాలన కొనసాగుతోందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తనయుడు లోకేష్ రెడ్‌బుక్ పాలన కొనసాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో బడుగు,బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేసిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఇప్పుడు చంద్రబాబుకు సూపర్‌సిక్స్ అంటే భయమేస్తోందని చెప్పుకోవడం మోసపూరితమైన చర్యగా అభివర్ణించారు. ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను వందశాతం పూర్తి చేసే ధైర్యం సీఎం చంద్రబాబుకు లేదన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఐక్యంగా ఉండాలని ఎప్పటికప్పుడు టీడీపీ దౌర్జన్యాలను, అరాచకాలను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాజంపేట , రైల్వేకోడూరు నియోజకవర్గాలకు చెందిన జెడ్పీటీసీలు, పలువురు వైఎస్సార్‌సీపీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.